ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
తమిళనాడు
TAMILNADU
సోమవారం 1జూలై 2024

తెలుగు పద్యాలలో దాగిన చమత్కారం!

సాంప్రతి సురేంద్రనాథ్

ప్యారీస్, జూన్ 30: సకల భాషలకు ప్రోత్సాహమిచ్చినది తెలుగు భాష అని, తెలుగు పద్యాల్లో చమత్కారం దాగి ఉంటుందని ముంబైకి చెందిన సారస్వతోపాసకులు సాంప్రతి సురేంద్రనాథ్ అన్నారు. నగరంలో 2010 మార్చిలో ప్రారంభ మైన వేదవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 150వ ప్రసంగంగా 'సాహిత్యం- చమత్కార వైభవం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఆదివారం సాయంత్రం టి.నగర్ ఆంధ్రాక్లబ్ కృష్ణాహాల్‌లో అరుణా శ్రీనాథ్ ప్రార్థనాగీతంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. వక్త ప్రసంగిస్తూ ఒకప్పుడు మద్రాసు నగరం తెలుగు చలనచిత్ర పరిశ్రమకు కేంద్ర బిందువుగా ఉంటూ నటీనటులు, రచయితలు, సంగీత దర్శకులు, దర్శకులను అందించిందన్నారు. 149 నెలల క్రితం తెలుగు సాహిత్యాన్ని పెంచి పోషించేందుకు ఆవిర్భవించిన వేదవిజ్ఞాన వేదిక 150వ ప్రసంగ కార్యక్రమంలో పాల్గొనటం తనకెంతో ఆనందం కలిగిస్తోందన్నారు. సహజంగా సభల నిర్వహణ వల్ల ప్రజలకు లబ్ధి చేకూరాలని, సభలు శ్రోతలతో నిండుదనంతో ఉండాలని సూచించారు. శ్రీకృష్ణదేవరాయలు తెలుగుభాషను పెంచి పోషించారని, అయితే ప్రస్తుతం వాడుకలో ఉన్న తెలుగు భాషను చూస్తుంటే తెలుగు లెస్ అని అనిపిస్తోందని చమత్కరించారు. చమత్కారం చెప్పడానికి సమయపాలన అక్కరలేదని, పరిస్థితులు, వ్యక్తులను బట్టి అప్పటికప్పుడు చమత్కారం చెప్పవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వేదవిజ్ఞానవేదిక ట్రస్టీ విజయ్ రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు వక్తను ఘనంగా సత్కరించారు.



సురేంద్రనాథ్‌ను సత్కరిస్తున్న విజయ్‌రెడ్డి, కందనూరు మధు



సభకు హాజరైన తెలుగు భాషాభిమానులు

పెరియార్ వర్సిటీ వీసీ పదవీకాలం పొడిగింపు...

నేడు అధ్యాపకుల ఆందోళన



వీసీ జగన్నాథన్

అడయార్, జూన్ 30: సేలంలోని పెరియార్ విశ్వవిద్యాలయం ఉపకులపతి జగన్నాథన్ పదవీకాలాన్ని రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి మరో యేడాది పాటు పొడిగించడాన్ని ఆ యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. గవర్నర్ చర్యలకు వ్యతిరేకంగా సోమవారం నుంచి రిలే ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్టు ప్రకటించారు. సేలం జిల్లా కరుప్పూరులో ఉన్న పెరియార్ విశ్వవిద్యాలయానికి ఉప కులపతిగా జగన్నాథన్‌ను గవర్నర్ గతంలో నియమించారు. ఆ సమయంలోనే అనేక విమర్శలు వచ్చాయి. అన్నాడీఎంకే, ఆర్ఎస్ఎస్ సానుభూతిపరుడిగా ముద్రపడిన జగన్నాథన్‌ను వీసీగా నియమించడంపై అపుడే ఆ వర్సిటీ ఉద్యోగ సంఘాలతో పాటు పలు రాజకీయ పార్టీల నేతలు విమర్శలు గుప్పించారు. గవర్నర్ ఆదేశాల మేరకు వీసీగా బాధ్యతలు చేపట్టిన జగన్నాథన్.. తన వ్యవహారశైలితో వివాదాస్పదుడిగా మారారు. ఉద్యోగులను వేధించడం, కక్షసాధింపు చర్యలు, షెడ్యూల్ తెగల ఉద్యోగులను, సిబ్బందిని కించపరిచేలా మాట్లాడటం, యూనివర్సిటీ నిధుల దుర్వినియోగంతో పాటు పలు అవినీతి కార్యక్రమాలకు పాల్పడినట్టు వార్తలు వచ్చాయి. యూనివర్సిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై ఐఏఎస్ అధికారి పళనిస్వామి నేతృత్వంలో ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేయగా, అవినీతి అక్రమాలు జరిగినట్టు గుర్తించింది. ఇందులో మాజీ రిజిస్ట్రార్ తంగవేల్ కీలక పాత్ర ఉన్నట్టు తేలింది. దీంతో ఆయనపై మొత్తం 8 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, సస్పెండ్ చేయాలని ఉన్నత విద్యాశాఖ సిఫార్సు చేసింది. కానీ, గవర్నర్ మాత్రం ఏమాత్రం పట్టించుకోకుండా ఆయన రిటైర్డ్ అయ్యేందుకు సహకరించారు. అదేసమయంలో వీసీ జగన్నాథన్ మూడేళ్ళ పదవీకాలం ఆదివారంతో ముగిసింది. తన పదవీకాలాన్ని పొడిగించుకునేందుకు ఆయన ప్రయత్నించగా, ప్రభుత్వంతో పాటు యూనివర్సిటీ ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు ఖండించారు. ఈ నేపథ్యంలో వీసీ జగన్నాథన్ పదవీకాలాన్ని మరో యేడాదిపాటు పొడిగిస్తూ గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు. దీనిని యూనివర్శిటీ ప్రొఫెసర్లు, ఉద్యోగ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ విషయంపై యూనివర్శిటీ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి శక్తివేల్ మాట్లాడుతూ, పెరియార్ వర్సిటీ వీసీ జగన్నాథన్ పదవీకాలాన్ని మరో యేడాది పొడిగించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గవర్నర్ చర్య ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరినట్టుగా ఉందన్నారు. అనేక అవినీతి అక్రమాలు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన జగన్నాథ్‌కు మరో యేడాది పాటు పదవీకాలాన్ని పొడగిస్తూ గవర్నర్ ఆదేశించడం, వీసీ అవినీతి అక్రమాలకు అండగా నిలిచినట్టుగా భావించాల్సి ఉంటుందన్నారు. అందువల్ల వీసీ బాధ్యతల నుంచి జగన్నాథన్‌ను తొలగించాలని కోరుతూ న్యాయ పోరాటం చేయనున్నట్టు తెలిపారు. ఇందులోభాగంగా, సోమవారం నుంచి వివిధ దశల్లో తమ ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు.

సైదాపేట బాలుడి మృతికి కలరా కారణమా?



యువరాజ్ (ఫైల్‌ఫొటో)

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైదాపేటలో యువరాజ్ (11) అనే బాలుడు కలారా బారిన పడి మృతి చెందాడని, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు చికిత్స చేయడంలో జాప్యం చేశారని బాలుడి తండ్రి రాజేష్‌కుమార్ ఆరోపించారు. ఈ సంఘటనపై గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ వైద్య విభాగం అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి చిన్న పిల్లలకు రోగనిరోధక మందులు పంపిణీ చేస్తున్నారు. సైదాపేట అబిద్ కాలనీలో గత కొంతకాలంగా తాగునీటిలో మురుగునీరు కలిసి కలుషితమైందని స్థానికులు ఆరోపించారు. ఆ ప్రాంతంలోనే రాజేష్‌కుమార్ కుటుంబ నివసిస్తోంది. ఈ నెల 26న యువరాజ్ వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురికావటంతో అతడిని గిండిలోని ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మళ్ళీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక మృతి చెందాడు. ఈ నేపథ్యంలో యువరాజ్ చెల్లెలు మీరా కుమారి (7) కూడా వాంతులు విరేచనాలతో అస్వస్థత చెంది ఎగ్మూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో ఆహార భద్రతా విభాగం అధికారులు, కార్పొరేషన్ వైద్య విభాగం అధికారులు ఆ ప్రాంతంలో పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం యువరాజ్ మురుగునీరు కలిసిన నీటిని తాగటం వల్ల మృతి చెందాడా? లేక కలారా సోకి మృతి చెందాడా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయని, పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చాకనే వాస్తవాలు తెలుస్తాయని అధికారులు తెలిపారు.



తంజావూరులో ఎన్ఐఏ అధికారులు తనిఖీలు జరిపిన నివాసం

రాష్ట్రంలో ఎన్ఐఏ తనిఖీలు

● ఉగ్రవాద సంస్థ సానుభూతిపరుల ఇళ్లల్లో సోదాలు

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విదేశీ ఉగ్రవాద సంస్థల సానుభూతిపరులు, ఆ సంస్థలతో సంబంధాలున్న వారి ఇళ్లు, స్థావరాల సహా 12 చోట్ల జాతీయ దర్యాప్తు బృందం (ఎన్ఐఏ) అధికారులు ఆదివారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విదేశీ ఉగ్రవాద సంస్థలకు భారీ స్థాయిలో విరాళాలు, ఆ సంస్థలో చేరేందుకు యువకులకు శిక్షణ ఇచ్చిన కేసులో అరెస్టయిన అన్నా విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ నుంచి సేకరించిన వివరాల మేరకు ఈ తనిఖీలు కొనసాగాయి. రాష్ట్రమంతా నిషేధిత ఉగ్రవాద సంస్థల సానుభూతి పరులను గుర్తించి అరెస్టు చేసేందుకు రాష్ట్ర పోలీసులు, ఉగ్రవాద నిరోధక విభాగం సంయుక్తంగా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఆ మేరకు అన్ని జిల్లాల్లో పోలీసులు నిఘా పెంచారు. ఆ నేపథ్యంలో నిషేధిత 'హిజాప్ ఉద్దారీర్' అనే ఉగ్రవాద సంస్థకు మద్దతుగా యూట్యూబ్‌లో ప్రచారం చేసి, ఆ సంస్థలో యువకులను సభ్యులుగా చేర్పించారనే ఆరోపణలపై మే నెలలో ఆరుగురిని అరెస్టు చేశారు. గ్రేటర్ చెన్నై పోలీసులు సోషల్‌మీడియాపై నిఘా వేసినప్పుడు రాయపేటకు చెందిన కొందరు నిషేధిత ఉగ్రవాద సంస్థలకు మద్దతుగా వ్యవహరించారనే విషయం వెల్లడైంది. ఆ సంఘటనకు సంబంధించి హమీద్ హుసేన్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. యూట్యూబ్ ఛానల్‌లో నిషేధిత ఉగ్రవాద సంస్థలకు మద్దతుగా కథనాలు ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత హమీద్ హుసేన్ తండ్రి హమ్మద్ మన్సూర్, సోదరుడు అబ్దుల్ రహ్మాన్, వారి అనుచరులు ముగ్గురిని అరెస్టు చేశారు. చెన్నై సెంట్రల్ క్రైం విభాగం విచారణలో వీరంతా నిషేధిత ఉగ్రవాద సంస్థకు మద్దతుగా అన్ని జిల్లాల్లో యువకులను సభ్యులుగా చేర్పించేందుకు ప్రయత్నించినట్లు తెలుసుకున్నారు. మే 26న గ్రేటర్ చెన్నై క్రైం విభాగం పోలీసులు ఈ చర్యలు తీసుకోగా, నెల రోజుల తర్వాత ఈ మొత్తం వ్యవహారంపై జాతీయ దర్యాప్తు బృందం (ఎన్ఐఏ) విచారణ బాధ్యతలను స్వీకరించింది. ఇందులో భాగంగానే చెన్నై సహా 12 చోట్ల ఎన్ఐఏ అధికారులు ఆదివారం ఉదయం ఆకస్మిక తనిఖీలు జరిపారు. నగరంలోని రాయపేట, శివారు ప్రాంతమైన ముడిచ్చూరు వద్ద ఆదివారం వేకువజాము 5.30 గంటల నుంచి ఎన్ఐఏ అధికారులు సోదాలు ప్రారంభించారు. తాంబరం సమీపంలోని ముడిచ్చూరూ విద్యుత్‌బోర్డు కాలనీలో కబీర్ అహమ్మద్ నివాసంలో ఎన్ఐఏ డీఎస్పీ కుమరన్ నాయకత్వంలో అధికారులు తనిఖీలు జరిపారు. ఇదే విధంగా తంజావూరు కుళందైఅమ్మాళ్ నగర్‌లోని అహమ్మద్ నివాసగృహంలో ఎన్ఐఏ డీఎస్పీ నాయకత్వంలో నలుగురు అధికారులు సోదాలు నిర్వహించారు. తంజావూరు జిల్లా మానంకోరైలోని షేక్ అలావుద్దీన్ నివాసంలో, సాలియమంగళంలోని అబ్దుల్ ఖాదర్, ముజిబుర్ రహ్మాన్, కాదర్‌మైదీన్ అనే ముగ్గురి నివాసాల్లోనూ ఎన్ఐఏ అధికారులు తనిఖీలు జరిపారు. తంజావూరు జిల్లాలో మొత్తం ఐదుచోట్ల ఈ తనిఖీలు జరిగాయి.

తిరుచ్చిలో...

తిరుచ్చి సుబ్రమణ్యపురంలో అబ్దుల్ ఖాదర్ కుమారుడు అబ్దుల్ రహ్మాన్ నివాసంలోనూ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆ తర్వాత ఆదివారం మధ్యాహ్నం ఆయనను తంజావూరు తీసుకెళ్ళి విచారణ కొనసాగించారు. ఇదేరీతిలో ఈరోడ్ పెరియార్‌నగర్ కరుప్పణ్ణసామి వీధిలో నివసిస్తున్న మహమ్మద్ ఇజాక్ ఇంటిలోనూ, పూందురైరోడ్డులోని సార్బుద్దీన్ నివాసంలోను ఎన్ఐఏ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అముద నాయకత్వంలో అధికారులు ముమ్మర తనిఖీలు జరిపారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా ఒకే సారి 12 చోట్ల ఎన్ఐఏ అధికారులు తనిఖీలు నిర్వహించడం తీవ్ర కలకలం సృష్టించింది.

3న పరందూరు విమానాశ్రయ వ్యతిరేక కమిటీ నిరాహార దీక్ష

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూరు సమీపంలోని పరందూరు వద్ద విమానాశ్రయం ఏర్పాటును వ్యతిరేకిస్తూ జూలై 3న కలెక్టర్ కార్యాలయం వద్ద విమానాశ్రయ వ్యతిరేక కమిటీ నిరాహార దీక్ష చేయనుంది. ఇటీవల ముగిసిన శాసనసభ సమావేశాల్లో పరందూరు విమానాశ్రయం పనులు త్వరలో ప్రారంభమవుతాయని, హోసూరు వద్ద మరో విమానాశ్రయం కూడా ఏర్పాటవుతుందని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికి లొంగి పరందూరు వద్ద విమానాశ్రయం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం గర్హనీయమని విమానాశ్రయ వ్యతిరేక కమిటీ నాయకులు ఆరోపిస్తున్నారు.

ఫ్రాన్స్ పార్లమెంట్ ఎన్నికలు ....

పుదుచ్చేరిలో పోలింగ్

అడయార్, జూన్ 30: ఫ్రాన్స్ పార్లమెంట్‌కు రెండు దశల్లో పోలింగ్ జరుగనుంది. ఇందులో భాగంగా తొలి దశ పోలింగ్ జూన్ 30వ తేదీ ప్రారంభమైంది. మొత్తం 577 మంది పార్లమెంట్ సభ్యుల ఎన్నిక కోసం ఈ పోలింగ్ నిర్వహిస్తున్నారు. అయితే, ఈ ఎన్నికల్లో ఫ్రాన్స్ దేశం వెలుపల అంటే ఇతర దేశాల్లో నివసించే ఫ్రాన్స్ పౌరసత్వం కలిగిన వారు కూడా పోలింగ్‌లో పాల్గొనేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, పుదుచ్చేరిలో నివశిస్తున్న ఫ్రాన్స్ పౌరులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లుచేశారు. ఇందుకోసం పుదుచ్చేరి, చెన్నై ప్రాంతాల్లో ఉన్న ఫ్రాన్స్ రాయబార కార్యాలయాల్లో పుదుచ్చేరిలో రెండు, చెన్నై, కారైక్కాల్‌లలో ఒక్కొక్కటి చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈ కేంద్రాల్లో ఫ్రాన్స్ పౌరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పుదువైలో ముసలం...

బీజేపీ ఎమ్మెల్యేల తిరుగుబాటు



● రంగసామి సర్కారుకు ముప్పు ?

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో బీజేపీ శాసనసభ్యులు మంత్రి పదవులు, నామినేటెడ్ పదవుల కోసం తిరుగుబాటు చేస్తుండటంతో ఎన్ఆర్ కాంగ్రెస్ నాయకత్వంలోని ఎన్.రంగసామి ప్రభుత్వం ఇరకాటంలో పడింది. పుదుచ్చేరిలో రంగసామి, పార్టీకి చెందిన ముగ్గురు, ఇద్దరు బీజేపీ సభ్యులు మంత్రులుగా ఉన్నారు. ఎన్ఆర్ కాంగ్రెస్‌కు 10 మంది, బీజేపీకి ఆరుగురు ఎమ్మెల్యేలున్నారు. ఇక అసెంబ్లీలో ఆరుగురు ఇండిపెండెంట్ సభ్యుల్లో ముగ్గురు బీజేపీకి మద్దతిస్తున్నారు. వీరితో పాటు బీజేపీ నామినేటెడ్ ఎమ్మెల్యేలు ముగ్గురున్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్ఆర్ కాంగ్రెస్‌కు, బీజేపీకి మధ్య తరచూ విబేధాలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి రంగసామిపై బీజేపీ ఎమ్మెల్యేలు శాసనసభలోనూ, బయటా ఆరోపణలు చేయటం ఆనవాయితీగా పెట్టుకున్నారు. కొత్తగా మద్యం తయారీ కర్మాగారాలకు అనుమతి మంజూరులో అవినీతి అక్రమాలు జరిగాయని ఆరోపించారు. అంతే కాకుండా ముఖ్యమంత్రి రంగసామి ప్రతిపక్ష సభ్యులకు ఇస్తున్నంత గౌరవం కూడా తమకు ఇవ్వడం లేదని కూడా విమర్శిస్తున్నారు. తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి జరగడం లేదని, నిధులు కూడా కేటాయించడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి తరఫున బీజేపీ మంత్రి నమశ్శివాయం పోటీ చేసి ఓటమిపాలయ్యారు. దీంతో రెండు పార్టీలు ప్రస్తుతం ఎడమొఖం పెడముఖంగా వ్యవహరిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల ఓటమి తర్వాత బీజేపీ సభ్యులు రొటేషన్ పద్ధతిలో మంత్రి పదవి కేటాయించాలని సీఎంపై ఒత్తిడి తెస్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో తమకే ప్రాధాన్యం ఇవ్వాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యే, వారికి మద్దతిస్తున్న ఇండిపెండెంట్లు, నామినేటెడ్ శాసన సభ్యులంతా కలిసి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి సీఎం రంగసామి తమను పట్టించుకోవడం లేదని, తమకు నామినేటెడ్ పదవులు ఇచ్చేందుకు కూడా అంగీకరించడం లేదని ఆరోపించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం గురించి విలేఖరులు అడిగినప్పుడు రాష్ట్రాభివృద్ధికి సంబంధించి విషయాలపైనే గవర్నర్‌తో చర్చించినట్లు బీజేపీ ఎమ్మెల్యేలు తెలిపారు. అయితే గవర్నర్‌ను కలుసుకున్న తిరుబువనై రిజర్వుడు నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అంకాళన్ ఆడియో ఒకటి విడుదలై కలకలం సృష్టించింది. అందులో ముఖ్యమంత్రి అవినీతిపె గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమికి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు బీజేపీ ఎమ్మెల్యేలు గవర్నర్‌కు చెప్పారని కూడా అంకాళన్ ఆ ఆడియోలో వెల్లడించారు. జరుగుతున్న సంఘటనలన్నీ రంగసామి నేతృత్వంలోని ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి ముప్పువాటిల్లడం ఖాయమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

కల్తీ సారాకు చెక్

త్వరలో ప్యాకెట్లలో చౌక ధరకు మద్యం

ప్యారీస్, జూన్ 30: రాష్ట్రంలో కల్తీ సారా తయారీ విక్రయాలు పూర్తిస్థాయిలో నివారించే విధంగా చౌక ధరలో ప్యాకెట్ మద్యం విక్రయించేందుకు రాష్ట్రప్రభుత్వం పరిశీలిస్తోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా టాస్మాక్ మద్యం దుకాణాలున్నాయి. వీటిలో బ్రాంది, విస్కీ, రమ్, సహా బీరు కూడా అందుబాటులో ఉంది. ప్రభుత్వం ఎమ్మార్పీ ధరలకు మించి మద్యం విక్రయించరాదని టాస్మాక్ దుకాణాలకు ప్రభుత్వం ఆదేశించినప్పటికీ, వాటిని పట్టించుకోకుండా సీసాకు రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా వసూలుచేస్తున్నారు. దీనిపై మందుబాబులు సామాజిక మాధ్యమాల ద్వారా ఏకరువు పెడుతున్నా ప్రభుత్వం మాత్రం స్పందించలేదు. అధిక ధరల గురించి నిలదీస్తే వారిపై దాడులు జరుగుతున్నాయని మద్యం ప్రియులు పలు పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో 2021వ సంవత్సరం నుంచి టాస్మాక్ దుకాణాల్లో మద్యం ధరలను ప్రభుత్వం పెంచింది. అందువల్ల [illegible] శ్రామిక వర్గాలు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు కల్తీ సారా వెతుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా కల్తీ సారా తయారీ, విక్రయాలు కూడా పెరిగాయి. ఇటీవల కళ్లకుర్చి కరుణాపురంలో విక్రయించిన కల్తీ సారా తాగినన ఘటనలో 65 మంది మరణించగా, మరో 100 మందికి పైగా చికిత్స పొందుతున్నారు. కల్తీ సారా మరణాలపై గళమెత్తిన విపక్షాలు ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించాయి. పలు పార్టీలు రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధ చట్టం అమలుచేయాలని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తున్నాయి. ఇదిలా ఉండగా, టాస్మాక్ అధికారులు ఆదివారం మీడియాతో మాట్లాడుతూ... కల్తీ సారాను పూర్తిస్థాయిలో నివారించేలా చౌక ధరల్లో ప్యాకెట్ మద్యం విక్రయించేందుకు ప్రభుత్వం పరిశీలిస్తోందని, ఇవి కూడా టాస్మాక్ దుకాణాల్లోనే ఉంటాయని తెలిపారు.

ఉప ఎన్నికకు అదనపు ఈవీఎంలు

● సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్

పెరంబూర్, జూన్ 30: విక్రవాండి శాసనసభ ఉప ఎన్నికలో వినియోగానికి అదనపు ఈవీఎంలు చేరుకున్నాయి. విల్లుపురంలో ఉన్న కేంద్ర ఎన్నికల కమిషన్ గోదాము నుంచి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి పళని నేతృత్వంలో ఈవీఎంలు విక్రవాండికి శనివారం తరలించారు. ఈ నియోజకవర్గ ఉప ఎన్నికకు 276 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయగా, డ్రా పద్ధతిలో 331 ఈవీఎంలు, 331 నియంత్రణ పరికరాలు, 357 వీవీ పాడ్‌లు మొత్తం 1,019 పరికరాలు కేటాయించారు. కాగా, ఈ ఎన్నికల్లో 29 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, అదనపు ఈవీఎంలు అవసరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, విల్లుపురంలోని ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి 150 ఈవీఎంలు విక్రవాండి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల మధ్య ఈవీఎంలతో అధికారులు



పారా మిలిటరీ బలగాలు...

ఈ నెల 10వ తేది విక్రవాండి ఉప ఎన్నిక జరుగనుంది. అందుకోసం 275 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయగా, వాటిలో సమస్యాత్మక కేంద్రాలు గుర్తించి, ఆ ప్రాంతాల్లో ప్రజల స్వేచ్ఛగా ఓటు వేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఎన్నికల భద్రతకు పారామిలిటరీ బలగాలను వినియోగించనున్నారు. విక్రవాండి సమీపం ఆసూరు గ్రామంలో విల్లుపురం డీఎస్పీ సురేష్ నేతృత్వంలో పారా మిలిటరీ బలగాలు కవాతు నిర్వహించాయి.

సమాచార దర్శిని

రేపు అన్నా వర్సిటీ స్నాతకోత్సవం

పెరంబూర్, జూన్30: అన్నా విశ్వవిద్యాలయ 44వ స్నాతకోత్సవం మంగళవారం జరుగనుంది. వర్సిటీ ప్రాంగణంలోని వివేకానంద ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు జరుగనున్న ఈ వేడుకలకు వర్సిటీ ఛాన్సలర్, గవర్నర్ ఆర్ఎన్ రవి, ఉన్నత విద్యా శాఖ మంత్రి పొన్ముడి, ఏఐసీటీఈ అధ్యక్షుడు సీతారాం పాల్గొంటారని వర్సిటీ ప్రకటన విడుదల చేసింది.

గృహాల కేటాయింపునకు ఆధార్ తప్పనిసరి

పెరంబూర్, జూన్ 30: తమిళనాడు అర్బన్ డెవలప్‌మెంట్ కింద అమలవుతున్న ప్రాజెక్ట్‌లో గృహాలు పొందేందుకు ఆధార్ తప్పనిసరి రాష్ట్రప్రభుత్వం జీవో విడుదల చేసింది. సంక్షేమ పథక లబ్ధిదారులకు ఆధార్ కార్డు ఉండాలి. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకొనే ముందుగానే లబ్ధిదారులు ఆధార్ నెంబరు పొందాలని ప్రభుత్వం పేర్కొంది.

నేటినుంచి ఐటీఐ అడ్మిషన్ల ప్రారంభం

పెరంబూర్, జూన్ 30: రాష్ట్రంలోని ఐటీఐల్లో సోమవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఉద్యోగావకాశాలు, శిక్షణ శాఖ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని 102 ప్రభుత్వ, 305 ప్రైవేటు ఐటీఐలున్నాయి. వీటిలో 2024-25 విద్యా సంవత్సరానికి సోమవారం నుంచి ఈ నెల 15వ తేది వరకు అడ్మిషన్లు జరుగనున్నాయి. 8,10 తరగతులు ఉత్తీర్ణులైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్ల తో అడ్మిషన్ పొందవచ్చు. మరిన్ని వివరాలకు 9499055689 అనే నెంబరు సంప్రదించవచ్చు.

కూవం నదిపై రైలు వంతెన

ఐసిఎఫ్, జూన్ 30: చెన్నై బీచ్-ఎగ్మూర్ నాలుగో మార్గంలో కూవం నదిపై ఫ్లై ఓవర్ నిర్మించనున్నట్లు చెన్నై రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. ఎగ్మూర్-బీచ్ మధ్య రూ.280 కోట్లతో నాలుగో రైలు మార్గం నిర్మిస్తున్నారు. గత ఏడాది ఆగస్టులో పనులు ప్రారంభమయ్యాయి. పార్క్ టౌన్, పోర్ట్ రైల్వేస్టేషన్లలో పనులు పూర్తికావచ్చాయి. ఆ స్టేషన్ల మధ్య ఉన్న కూవం నదిపై ఫ్లై ఓవర్ నిర్మాణపనులు చేపడుతున్నారు. మొత్తం అన్నీ పనులు మరో మూడు నెలల్లో పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

కాశీ, గయ క్షేత్రాలకు ఆధ్యాత్మిక రైలు

ఐసిఎఫ్, జూన్ 30: ఆడి అమావాస్యను పురస్కరించుకొని కాశీ, గయక్షేత్రాలకు ఆధ్యాత్మిక పర్యాటక రైలు నడుపునున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రం నుంచి పూరి జగన్నాథ్, కాశీ గంగా స్నానం, విశ్వనాథుడు, విశాలాక్షి, అన్నపూర్ణ దర్శనం, గయాలో ఆడి అమావాస్య రోజున పిండ ప్రదానం, అయోధ్యలో బాలరాముడి దర్శనం, త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలకు ఏర్పాటుచేశారు. మదురై నుంచి ఈ నెల 31వ తేది బయల్దేరే ఈ ఆధ్యాత్మిక పర్యాటక రైలు దిండుగల్, తిరుచ్చి, విరుదాచలం, విల్లుపురం, చెన్నై మీదుగా నడువనుంది. 10 రోజుల పర్యటనకు స్లీపర్ కోచ్‌లో ఒకరికి రూ.19,500, ఏసీ కోచ్‌లో రూ.32,500 ఛార్జీ నిర్ణయించారు. ఇతర వివరాలకు 7305858585 నెంబరు సంప్రదించవచ్చు.

పాఠశాల విద్య డైరెక్టర్‌గా కన్నప్పన్

ఐసిఎఫ్, జూన్ 30: ప్రాథమిక విద్య డైరెక్టర్ కన్నప్పన్ పాఠశాల విద్య డైరెక్టర్‌గా నియమితులయ్యారు. పాఠశాల విద్య డైరెక్టర్ అరివొళి ఆదివారం పదవీ విరమణ పొందారు. దీంతో కన్నప్పన్‌ను పాఠశాల విద్య డైరెక్టర్‌గా నియమిస్తూ పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కుమరగురుపరన్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ సేతురామవర్మ ప్రాథమిక విద్య డైరెక్టర్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర ఉపాధ్యాయ విద్య, పరిశోధన శిక్షణ డైరెక్టరేట్ డైరెక్టర్ లలితకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ డైరెక్టర్ బాధ్యతలు అదనంగా అప్పగించారు.

5న జాలర్ల ఆందోళన

ఐసిఎఫ్, జూన్ 30: శ్రీలంక జైలులో ఉన్న జాలర్లను విడిపించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5వ తేది జాలర్ల సంఘాలు ఆందోళన చేపట్టనున్నాయి. శ్రీలంక నావికాదళం ఇటీవల 36 మంది రాష్ట్ర జాలర్లను అరెస్ట్ చేసి, 160కి పైగా మోటారు పడవలను స్వాధీనపరచుకుంది. పడవలతోపాటు జాలర్లను విడిపించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని రామేశ్వరం మత్స్యశాఖ టోకెన్ కార్యాలయం ఎదుట జాలర్ల సంఘాలు ఆందోళన చేపట్టనున్నాయి.

నేటినుంచి తాగునీటి నాణ్యత పరిశీలన

ఐసిఎఫ్, జూన్ 30: నగరంలో తాగునీరు సరఫరా మోతాదు, నీటి నాణ్యతలను మెట్రోవాటర్ బోర్డు అధికారుల బృందం పరిశీలించనుంది. చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 15 మండలాల్లో 80 లక్షల మందికి పైగా నివసిస్తున్నారు. వీరికి మెట్రోవాటర్ బోర్డు పైప్‌లైన్, లారీల ద్వారా తాగునీరు సరఫరా చేస్తుంది. పలు ప్రాంతాల్లో పైప్‌లైన్ ద్వారా సరఫరా అయ్యే మురుగు నీటితో కలసి వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల నీరు సక్రమంగా రావడంలేదు. దీనిపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరడంతో స్పందించిన మెట్రో వాటర్‌బోర్డు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందం ఏర్పాటుచేసింది. ఈ బృందం 15 మండలాల్లో సోమవారం నుంచి తనిఖీలు నిర్వహించనుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూన్ 30: మరమ్మతుల కారణంగా అంబత్తూర్ పరిధిలోని మహాలక్ష్మి నగర్, సుందరచోళపురం, రామ్ నగర్, సుందరవినాయక నగర్, లోటస్ అవెన్యూ, చిన్నకోలడి, చెల్లియమ్మన్ నగర్, దేవి నగర్, సేవా అపార్ట్‌మెంట్, సుమంగళి మానసరోవర్ అపార్ట్‌మెంట్, బాబా నగర్, జస్వంత్ నగర్ ఫేస్-1,2, రెడ్డిపాళయం రోడ్డు, మీనాక్షి అవెన్యూ, అన్నామలై అవెన్యూ, పోరూర్ పరిధిలోని ఆవడి రోడ్డు, మేట్టు వీధి, అంబాళ్ నగర్, వానియర్ వీధి, పూందమల్లి బైపాస్ రోడ్డు, ఎస్ఎస్ ఆలయ వీధి ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అన్ని కళాశాలల్లో ఒకేసారి సెమిస్టర్ పరీక్షలు

పెరంబూర్, జూన్ 30: రాబోయే విద్యా సంవత్సరంలో ఆర్ట్స్ సైన్స్ కళాశాలల్లో ఒకే సమయంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలు విడుదల చేయాలని కళాశాల విద్య డైరెక్టర్ కార్మేగం ప్రకటించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 3వ తేది తరగతులు ప్రారంభించి, సెమిస్టర్ పరీక్షలు అక్టోబరు 31న ప్రారంభించి, నవంబరు 25వ తేదీతో ముగించాలి. డిసెంబరు 16లోపు అన్ని కళాశాలల ఫలితాలు వెల్లడించాలని కళాశాల విద్య ఉత్తర్వులు జారీచేసింది.

మాంజా, డ్రోన్లపై నిషేధం పొడిగింపు

పెరంబూర్, జూన్ 30: నగరంలో మాంజాదారం, డ్రోన్ల ఎగురవేతపై నిషేధం మరో 60 రోజులు పొడిగించారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ విడుదల చేసిన ప్రకటనలో, మాంజా దారం తయారీ, విక్రయాలు, డ్రోన్లు ఎగురవేత, రిమోట్ కంట్రోల్ మైక్రో-లైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్, పారా గ్లైడర్స్‌పై విధించిన నిషేధం గతనెల 29తో ముగిసిందని, నిషేధం గడువు సెప్టెంబరు 27వ తేది వరకు పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.

పాఠశాల మోడల్ పార్లమెంటు ఎన్నికలు

● ఉత్సాహంగా ఓటేసిన విద్యార్థులు

పెరంబూర్, జూన్ 30: నీలగిరి జిల్లా కూడలూరు మేఫీల్డ్ మాధ్యమిక పాఠశాలలో జరిగిన మోడల్ పార్లమెంటు ఎన్నికల్లో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా ఓటేశారు. మేఫీల్డ్‌లోని పంచాయతీ మాధ్యమిక పాఠశాలలో పార్లమెంటు ఎన్నికలు శనివారం జరగగా, అధ్యక్షుడు, ఇతర పదవులకు 34 మంది విద్యార్థులు పోటీచేశారు. ఎన్నికల అధికారులుగా ఉపాధ్యాయులు బాబు, కుమార్, కర్పగవల్లి, పార్వతి, తులసి, సులైఖ, మాలతి వ్యవహరించారు. పోటీచేసిన విద్యార్థుల తరపున ఏజెంట్లు పేర్ల జాబితాను సరిచూసి విద్యార్థులను వరుస క్రమంలో పోలింగ్ కేంద్రంలోకి పంపారు. ఈ సందర్భంగా పాఠశాల పార్లమెంటు ప్రాధాన్యత, విధులు తదితరాలను ప్రధానోపాధ్యాయులు పాల్ విక్టర్ విద్యార్థులకు వివరించారు. ఈ ఎన్నిక ఓట్ల లెక్కింపు సోమవారం జరుగనుంది.



ఓటేసిన ఆనందంలో విద్యార్థులు

ఒకరోజు హెచ్‌ఎంగా విద్యార్థిని



మేయివర్షితకు బాధ్యతలు అప్పచెబుతున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పెరంబూర్, జూన్ 30: పుదుకోటలో ప్రభుత్వ రాణియార్ బాలికల మహోన్నత పాఠశాలలో వెయ్యి మందికి పైగా విద్యార్థినులు చదువుతున్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా, చదువులో రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు తెస్తున్న ప్లస్ వన్ బయాలజీ విద్యార్థిని మేయివర్షితను ఒకరోజు ప్రధానోపాధ్యాయురాలిగా చేయాలని ఉపాధ్యాయులు నిర్ణయించారు. శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తమిళరసి, ఉపాధ్యాయులు అందరూ మేయివర్షితను హెచ్‌ఎం సీటులో కూర్చోబెట్టారు. అనంతరం మేయివర్షిత ఉపాధ్యాయుల అటెండెన్స్ పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లిన ఆమె, పాఠశాలల్లో సమస్యలు, బోధనా పద్ధతుల్లో లోపాలుంటే తనకు తెలియజేయాలని విద్యార్థులను కోరారు. భవిష్యత్తులో తాము చేయబోయే పనులను సక్రమంగా నిర్వహించడం, నాయకత్వ లక్షణాలు తదితరాలు పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు నేర్చుకొనేలా ఈ కార్యక్రమం చేపట్టినట్లు హెచ్‌ఎం తమిళరసి తెలిపారు.

రాష్ట్రంలో 125 శాతం అదనపు వర్షపాతం

పెరంబూర్, జూన్ 30: రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుత ఏడాది నైరుతి రుతుపవనాలతో 124 శాతం అధిక వర్షపాతం నమోదైందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. రాష్ట్రవ్యాప్తంగా గత నెల 1 నుంచి 28వ తేది వరకు నైరుతి రుతుపవనాలతో సరాసరిగా 47.8 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ప్రస్తుత ఏడాది 107.2 మి.మీ నమోదైంది. ఆ ప్రకారం, సాధారణం కన్నా 124 శాతం అధిక వర్షపాతం నమోదైంది. అలాగే, గత మే నెలలో 19 శాతం అధికంగా వర్షం కురిసింది. ఈ ఏడాది అధికంగా నీలగిరిలో 292.3 మి.మీ, కోవైలో 231.5 మి.మీ, రాణిపేటలో 206.7 మి.మీ, కనియాకుమారిలో 200.4 మి.మీ, తక్కువగా తూత్తుకుడిలో 6.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

నగరంలో 241 శాతం అధికం...

నగరంలో జూన్ నెల ప్రారంభం నుంచే పగటి వేళల్లో ఎండ తీవ్రత, రాత్రి వర్షం కురుస్తోంది. సాధరణంగా నగరంలో 58.8 మి.మీ వర్షం నమోదుకావాల్సి ఉండగా, ఈ ఏడాది మ241 శాతం అధికాంగా 200.4 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలిపింది.

పోలీసు వాహనాన్ని ఢీకొన్న లారీ

● పోలీసులు సహా ముగ్గురు ఖైదీలకు గాయాలు

ప్యారీస్, జూన్ 30: తిరుచ్చి జిల్లా గాంగేయం ప్రాంతంలో పోలీసు వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఐదుగురు పోలీసులు, ముగ్గురు ఖైదీలకు గాయాలయ్యాయి. జిల్లాలోని జంబునాధపురంకు చెందిన శవరణపాండి, కిషోర్, తేన్‌కోడు, మనోజ్ అనే ఖైదీలను కోవై జైలు నుంచి విచారణకు హాజరుపరిచేందుకు పోలీసు వాహనంలో తిరుచ్చి సమీపంలోని తొట్టియం మేజిస్ట్రేట్ కోర్టుకు వ్యానులో తీసుకెళ్లారు. శనివారం ఆ ఖైదీలను కోర్టులో హాజరుపరచిన అనంతరం ఎస్ఐ బాలమురళీకృష్ణ, కానిస్టేబుళ్లు కలైసెల్వన్, గోకుల్, సెల్వకుమార్, తెన్నరసు, చార్లెస్‌లు కోవై జైలుకు బయల్దేరారు. వారు గాంగేయం ప్రాంతం చేరుకున్న సమయంలో ఎదురుగా వచ్చిన లారీ అదుపుతప్పి హఠాత్తుగా ఢీకొంది. ఇందులో పోలీసు వాహనంలో ఉన్న పోలీసులు, ఖైదీలకు గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విక్రవాండి ఎన్నికల అధికారిని బదిలీచేయాలి

● పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి

పెరంబూర్, జూన్ 30: విక్రవాండి ఉప ఎన్నికల అధికారిని బదిలీ చేయాలని పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి రాందాస్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన విడుదల చేసిన ప్రకటనలో... విక్రవాండి ఉప ఎన్నికల పర్యవేక్షణలో 8 మంది మంత్రులు, 80 మంది ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో మకాం వేశారని తెలిపారు. నియోజకవర్గంలో అడుగడుగునా ఎన్నికల నిబంధన ఉల్లంఘన జరుగుతోందని, అధికారపార్టీ ఓటర్లను ప్రలోభపెడుతోందన్నారు. ఇన్ని జరుగుతున్నా ఎన్నికల అధికారి స్పందించడం లేదని, ఈ విషయమై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించి ఎన్నికల అధికారిని బదిలీ చేయాలని డా.అన్బుమణి కోరారు.

పరారీలో ఉన్న యువకుడి అరెస్ట్

ప్యారీస్, జూన్ 30: నేరాలకు సంబంధించిన కేసుల్లో గ్రేటర్ చెన్నై పోలీసులు వెతుకుతున్న యువకుడు అబుదాబి వెళ్లేందుకు ప్రయత్నించి ఎట్టకేలకు పట్టుబట్టాడు. నగరానికి చెందిన వసంత్ డేవిడ్ (25)పై తిరుమంగళం పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగుల విధులను అడ్డుకోవడం, బెదిరించడం తదితర కేసులు కూడా నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో నమోదయ్యాయి. దీంతో అజ్ఞాతంలోకి జారుకున్న డేవిడ్‌ను అరెస్ట్ చేసేందుకు పలు ప్రాంతాల్లో గాలించినా అతని జాడ తెలియకపోవడంతో పోలీసులు తప్పించుకున్న నేరస్తుడిగా ప్రకటించారు. అంతర్జాతీయ విమానాశ్రయాలు, ప్రధాన రైల్వే స్టేషన్లకు డేవిడ్ పేరుతో లుకౌట్ నోటీసు కూడా జారీ అయింది. ఈ నేపథ్యంలో, శుక్రవారం సాయంత్రం నగరం నుంచి అబుదాబి వెళ్లాల్సిన ప్రయాణికుల పాస్‌పోర్ట్, వీసా తదితర రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు వసంత్ డేవిడ్‌ను గుర్తించి బంధించి తిరుమంగళం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

విద్యుత్ వైరు తగిలి లారీ దగ్ధం



వేలూరు, జూన్ 30: గుడియాత్తం సమీపం నెల్లూరుపేట ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున మినీ లారీ అగ్నిప్రమాదానికి గురైంది. గడ్డి మోపులతో వస్తున్న లారీకి పైన ఉన్న విద్యుత్ తీగ తగలడంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న గుడియాత్తం అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపుచేశారు.

జాకీల సాయంతో పైకెత్తిన కాళియమ్మన్ ఆలయం



పెరంబూర్, జూన్ 30: స్థానిక విరుగంబాక్కంలో కాళియమ్మన్ ఆలయం ఉంది. హిందూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని ఈ ఆలయం 200ఏళ్ల పురాతనమైనది. విరుగంబాక్కం ప్రాంత గ్రామదేవతగా పిలుస్తుంటారు. ఈ ఆలయంలో మహాకాళియమ్మన్, దుర్గా అమ్మన్, సెల్వగణపతి, వల్లి సుబ్రమణ్యస్వామి దేవతామూర్తులు, ఆంజనేయ, నవగ్రహాలు, నాగలింగం తదితర సన్నిధులున్నాయి. ఆలయం రోడ్డు మట్టానికి దిగువన ఉండడంతో, వర్షాకాలంలో ఆలయంలోకి నీరు ప్రవేశిస్తోంది. ప్రస్తుతం ఈ రోడ్డులో మెట్రోరైలు పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఆలయ గర్భగుడి తదితరాలను జాకీల సాయంతో 5 అడుగుల ఎత్తుకు లేపేందుకు పనులు చేపట్టారు. మహాకాళియమ్మన్ భక్తజన సభ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో చేపట్టిన పనులుఆరు నెలల్లో పూర్తిచేసి, మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మాంజోలై టీ ఎస్టేట్‌ను ప్రభుత్వమే నడపాలి!

● కార్మికుల సంఘం డిమాండ్

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాలోని మాంజోలైన టీ ఎస్టేట్‌ను రాష్ట్ర ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని నడపాలని ఆదివారం ఉదయం జరిగిన ఆ ఎస్టేట్ కార్మిక సంఘాల సమావేశం డిమాండ్ చేసింది. ప్రస్తుతం ఆ చోట టీ ఎస్టేట్ నడుపుతున్న ది బాంబే బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్ సంస్థ లీజు గడువు ముగియడానికి ఇంకా రెండేళ్లున్నా ఈ ఆగస్టులోగా ఎస్టేట్‌లో తేయాకు కార్మికులుగా పనిచేస్తున్నవారి కుటుంబాలను ఖాళీచేయమంటూ నోటీసులు జారీ చేసింది. దీంతో ఆ ఎస్టేట్ కార్మికుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే సుమారు 500 కార్మికుల కుటుంబాలు ఆ ఎస్టేట్ ప్రాంతాన్ని విడిచి వెళ్లాయి. తక్కిన కార్మికులు కూడా ఆగస్టులోగా ఖాళీ చేయాల్సి ఉంది. ఈ పరిస్థితులలో ఆ ఎస్టేట్ కార్మిక సంఘాల నాయకులు కార్మికులతో ఆదివారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో మాంజోలై టీ ఎస్టేట్‌ను రాష్ట్ర ప్రభుత్వమే నడపాలని, అందుకు కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

యజమాని ఇంట్లో చోరీ : కారు డ్రైవర్ అరెస్ట్

పెరంబూర్, జూన్ 30: స్థానిక పట్టణంబాక్కానికి చెందిన వ్యాపారి ఇంట్లో రూ.2 కోట్ల విలువైన నగలు, నగదు చోరీ చేసిన వ్యవహారంలో కారు డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్‌చేశారు. స్థానిక ఎమ్మార్సీ నగర్ సత్యదేవ్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న గోపాలకృష్ణన్ షేర్ మార్కెట్ వ్యాపారం చేస్తున్నాడు. ఆయన వద్ద అశోక్ నగర్ ప్రాంతానికి చెందిన శరవణన్ పదేళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల శరవణన్ తీరుపై సందేహించిన గోపాలకృష్ణన్ గత నెల 27వ తేది పని నుంచి తొలగించాడు. మరుసటిరోజు ఇంటో బీరువా లాకర్ తాళాలు కనిపించక పోవడంతో గోపాలకృష్ణన్ దానిని బద్దలుకొట్టి పరిశీలించగా, అందులో ఉంచిన 250సవర్ల నగలు, 10కిలోల వెండిఆభరణాలు,రూ.25లక్షల నగదు మాయవడంతో దిగ్భ్రాంతి చెంది పట్టణంబాక్కం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన వద్ద పనిచేసిన శరవణన్‌పై అనుమానం ఉన్నట్లు గోపాలకృష్ణన్ ఫిర్యాదులో తెలుపడంతో, పోలీసులు శరవణన్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

బాణసంచా ఫ్యాక్టరీ లైసెన్సు రద్దు : యజమాని అరెస్టు

అడయార్, జూన్ 30: విరుదునగర్ జిల్లా సాత్తూరు సమీపంలోని అచ్చంకుళంలోని ఓ బాణసంచా కర్మాగారంలో జరిగిన పేలుడులో నలుగుకు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆ ఫ్యాక్టరీ లైసెన్సును ప్రభుత్వం రద్దు చేసింది. అలాగే, ఈ ప్రమాదానికి కారణమైన ఫ్యాక్టరీ యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. అచ్చంకుళంకు చెందిన సహదేవన్ ఈ బాణసంచా తయారీ కర్మాగారాన్ని నడుపుతున్నారు. ఇందులో 50 మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారు. అయితే, శనివారం ఉదయం జరిగిన పేలుడులో నలుగురు కార్మికులు మరణించారు. అలాగే, ఈ ప్రమాదంపై సాత్తూరు తాలూకా పోలీసులు ఐదు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, యజమాని సహదేవన్‌ను అరెస్టు చేశారు. అలాగే, ఫ్యాక్టరీ లైసెన్సును జిల్లా రెవెన్యూ అధికారి రాజేంద్రన్ రద్దు చేశారు.

వైభవంగా గంగమ్మ శిరస్సు వేడుకలు



వేలూరు, జూన్ 30: కేవీ కుప్పం తాలూకా వేపంగేరి గ్రామములో 132వ వార్షిక గంగమ్మ శిరస్సు వేడుకలు ఆదివారం జరిగాయి. దీంలో గంగమ్మ శిరస్సు ఊరేగింపు, కాపు కట్టు జరిగింది. వేడుకల్లో భాగంగా గంగమ్మకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులు అంబళ్లు పోసి, పిండి దీపాలు వెలగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనగా, భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

రైల్వే కార్మికుల క్రీడా పోటీలు



క్రీడా పోటీల్లో కార్మికులు

వేలూరు, జూన్ 30: స్థానిక కాట్పాడి భరణీస్ పురం క్రీడా మైదానంలో తెన్నగ్రై రైల్వే ఎన్ఎస్ఎస్ డా.ఏపీజే అబ్దుల్ కలామ్ ఎన్‌సీసీ, అన్నై థెరిస్సా దక్షిణ రైల్వే కేంద్ర జిల్లా కాట్పాడి 8వ సంవత్సర ముగింపు వేడుకలు జరిగాయి. రైల్వే కార్మికుల కోసం జరిగిన ఆటల పోటీలను కార్పొరేషన్ 1వ మండల కమిటీ అధ్యక్షుడు పుష్పలత వన్నియరాజ, కౌన్సిలర్లు రవికుమార్, చిత్ర లోకనాథన్, చిత్ర మహేంద్రన్, దక్షిణ రైల్వే శాఖ ఉపాధ్యక్షుడు ఆర్.పరిమళకుమార్, జిల్లా సెక్రటరీ జయ వెంకటేష్, తదితరులు ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ గ్రూపు అధ్యక్షుడు భూపాలన్, ఢిల్లీ కుమార్, పుణ్యకోటి, సామువేలు కీర్తివాసన్, సంగీత, సుకన్య, దేవికా ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

మేక రక్తం తాగిన పూజారి మృతి



పళనిసామి (ఫైల్‌ఫొటో)

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా గోపిశెట్టిపాళయం సమీపంలోని అన్నామలైయార్ ఆలయంలో జరిగిన వేడుకల్లో మేక రక్తం తాగిన పూజారి మృతి చెందారు. కౌలప్పూరు చెట్టిపాళయంలోని అన్నామలైయార్ ఆలయంలో పళనిసామి (56) పూజారి. ప్రస్తుతం ఆ ఆలయంలో వార్షిక ఉత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం ఆ ఆలయం వద్ద భక్తులు 20కిపైగా మేకలను బలిచ్చారు. ఆ సందర్భంగా పళనిసామి సహా ఐదుగురు పూజారులు మేక రక్తాన్ని తాగారు. కాసేపటికి పళనిసామి వాంతులు చేసుకుని మూర్ఛిల్లాడు. వెంటనే ఆయనను గోపిచెట్టిపాళయం ఆసుపత్రికి తీసుకెళ్ళారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. గోపిచెట్టిపాళయం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

సాత్తుకుప్పంలో పిల్లల వైద్యశిబిరం

వేలూరు, జూన్ 30: స్థానిక పలవన్‌సాత్తుకుప్పం 55వ వార్డులో ఆదివారం తమిళగ వెట్రి కళగం తరపున విజయ్ నర్సరీ, ప్రైమరీ పాఠశాలల్లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి జిల్లా అధ్యక్షుడు వేల్‌మురుగన్ అధ్యక్షత వహించగా, వెంకట్, లోకేష్, హరి పర్యవేక్షణలో జరిగింది. కస్పా మెడికల్ సెంటర్ చిన్నపిల్లల ప్రత్యేక చికిత్సా కేంద్రం డాక్టర్ పాల్గొని, పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నవీన్, యువరాజ్, అఖిలన్, రాజశేఖర్, కార్తీక్, ఆనంద్ బాబు, లలిత్‌కుమార్, వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

మత్తుబిళ్లలు విక్రయించిన ఆరుగురి అరెస్ట్

ప్యారీస్, జూన్ 30: స్థానిక కోయంబేడు ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరించిన ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి 2,700 మత్తుబిళ్లలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోయంబేడు మెట్రో రైల్వేస్టేషన్ సమీపంలో కొందరు వ్యక్తులు మత్తుబిళ్లలు విక్రయిస్తున్నట్లు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ శరవణన్‌కు సమాచారం అందింది. దీంతో ఆయన 10 మందికి పైగా పోలీసులతో శనివారం సాయంత్రం సంఘటనా స్థలానికి చేరుకొని నిఘాలో పాల్గొన్నారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా సంచరించిన బాలుడి సహా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా వారు చట్టవిరుద్ధంగా మత్తుబిళ్లలు విక్రయిస్తున్న వైనం బయటపడింది. దీంతో హరీష్, అజయ్, విజయ్‌కుమార్, గోకుల్ అనే వారిని అరెస్ట్ చేసి వారి నుంచి 2,700లకు పైగా మత్తుబిళ్లలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా ఇంతకు ముందు మూడు నెలల క్రితం మత్తుబిళ్లలు విక్రయిస్తూ పట్టుబడి జైలుకెళ్లి బెయిలుపై విడుదలయ్యారని, వీరు ముంబై నుంచి అక్రమంగా మత్తుబిళ్లలు తీసుకువచ్చి నగరంలో కళాశాల విద్యార్థులు, కూలీ కార్మికులు, ఐటీ సంస్థల ఉద్యోగులకు ఆన్‌లైన్ ద్వారా కూడా విక్రయిస్తున్నట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

పెరంబూర్, జూన్ 30: స్థానిక ఎమ్మార్సీ నగర్‌లో విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతిచెందాడు.తిరువాన్మియూర్‌కు చెందిన మహేశ్వరన్(42) ఎమ్మార్సీ నగర్‌లో ఇంటికి వైరింగ్ చేస్తున్నాడు. అల్యూమినియం నిచ్చెన ఎక్కి పనిచేస్తున్న సమయంలో వైరు నిచ్చెనకు తాకడంతో విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు.

కోయంబేడు-ఆవడి వరకు మెట్రో మార్గం పొడిగింపు

ఐసిఎఫ్, జూన్ 30: స్థానిక కోయంబేడు-ఆవడి, పూందమల్లి-పరందూర్ వరకు మెట్రోమార్గాన్ని పొడిగించనున్నట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. చెన్నైమెట్రోరైలు సేవలను శివారు ప్రాంతాలతో అనుసంధానం చేయాలని ఈ సంస్థ నిర్ణయించింది. ఆ ప్రకారం, సిరుచ్చేరి-కిలంబాక్కం, పూందమల్లి-పరందూర్, కోయంబేడు-ఆవడి మధ్య మెట్రోరైలు సేవలపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. ఇందులో పూందమల్లి-పరందూర్, కోయంబేడు-ఆవడి పథకానికి రాష్ట్రప్రభుత్వం ఆమోదం తెలిపిందని అధికారులు తెలిపారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ కోత ఫిర్యాదులపై సత్వర చర్యలు

ఐసిఎఫ్, జూన్ 30: విద్యుత్ కోత ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అన్నాసాలై విద్యుత్ బోర్డు ప్రధాన కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రం ఉంది. 9498794987 అనే మొబైల్ నెంబరుకు విద్యుత్ కోతలు, మీటరు మరమ్మతులు, ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. ఒక షిఫ్టుకు 60 మంది చొప్పున మూడు షిఫ్టుల్లో ఒప్పంద కార్మికులు 24 గంటలు పనిచేస్తున్నారు. అక్కడి నుంచి జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ కార్యాలయానికి సమాచారమిచ్చి, సంబంధిత శాఖా కార్యాలయాల సహాయ ఇంజనీర్ల ద్వారా ఈ సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఆయా ప్రాంతీయ ఇంజనీర్ల మొబైల్ నెంబర్లకు ఫిర్యాదులను ఎస్ఎంఎస్‌లు పంపేలా చర్యలు చేపట్టనున్నారు. త్వరలో ఈ సత్వర చర్యలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

యూజీసీ నెట్ తేదీల వెల్లడి

ఐసిఎఫ్, జూన్ 30: రద్దయిన యూజీసీ నెట్ ఆగస్టులో నిర్వహించనున్నట్లు జాతీయ పరీక్షల ఏజెన్సీ తెలిపింది. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో చేరేందుకు, పరిశోధన కోర్సులు కేంద్ర ప్రభుత్వ ఉపకారవేతనంతో చదివేందుకు నెట్ అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి. జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్టీఏ) ఏడాదికి రెండు సార్లు నిర్వహిస్తోంది. ఆ ప్రకారం, ఈ ఏడాది మొదటి విడత పరీక్ష జూన్ 18న నిర్వహించగా 9.8 లక్షల మంది హాజరయ్యారు. వాటి ఫలితాలు విడుదల చేయనున్న నేపథ్యంలో, పరీక్షను పారదర్శకంగా నిర్వహించలేదన్న ఆరోపణలు రావడంతో రద్దుచేశారు. ఈ నేపథ్యంలో, జూన్ నెలకుగాను రద్దయిన యూజీ నెట్ ఆగస్టు 21వ తేది, సెప్టెంబరు 4వ తేది నిర్వహించనున్నారు. అదే విధంగా జూన్ 20 నుంచి 27వ తేది వరకు జరుగనున్న సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ పరీక్ష వాయిదాపడింది. ఆ పరీక్ష ఈ నెల 25 నుంచి 27వ తేది వరకు నిర్వహించనున్నట్లు ఎన్టీఏ ప్రకటించింది.

దీపావళి రిజర్వేషన్లు ప్రారంభం

పెరంబూర్, జూన్ 30: రైళ్లలో 120 రోజుల ముందు రిజర్వేషన్ సౌకర్యం ఉంది. ఆ ప్రకారం, ఈ ఏడాది దీపావళి అక్టోబరు 31న దేశప్రజలు జరుపుకోనున్నారు. దీపావళి పండుగకు సొంతూళ్లకు వెళ్లాలనుకుంటున్న ప్రజలు అక్టోబరు 28,29,30 తేదీల్లో ప్రయాణించేందుకు రైళ్లలో ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైంది. అక్టోబరు 28వ తేది వెళ్లగోరువారు ఆదివారం, 29వ తేది వెళ్లాలంటే సోమవారం, 30వ తేదికి మంగళవారం టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకొనే వారి సంఖ్య పెరిగిందన్నారు. 80 శాతం మంది ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకుంటున్నారని, అందువల్ల సాంకేతిక లోపంతో రిజర్వేషన్లకు అంతరాయం కలుగుతుందన్నారు. దీపావళి రిజర్వేషన్లు పరిశీలించి, అదనపు రైళ్లు, బోగీల అనుసంధానం చేసే అంశాలు పరిశీలిస్తామని అధికారులు తెలిపారు.

సీబీఐ అధికారి పేరుతో రూ.50 లక్షల మోసం

● కేరళ యువకుడి అరెస్ట్

పెరంబూర్, జూన్ 30: సీబీఐ అధికారినంటూ రూ.50 లక్షల మోసానికి పాల్పడిన కేరళ రాష్ట్రానికి చెందిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాంబరం సమీపం ఇరుంబులియూర్ సెందిల్‌మురుగన్ వీధికి చెందిన ఎం.సురేష్‌కుమార్ (52)కు ఇటీవల ఫోన్ చేసిన కొంతమంది తాము సీబీఐ అధికారులమని, చట్టవిరుద్ధంగా వ్యాపారం చేస్తున్నారని ముంబైలో కేసు నమోదైందని, విచారణ కోసం మీ బ్యాంక్ ఖాతానుంచి నగదు తమ ఖాతాకు బదిలీ చేయాలని, విచారణ అనంతరం మళ్లీ ఖాతాకు పంపుతామని పేర్కొన్నారు. వారి మాటలతో భయాందోళనలు చెందిన సురేష్ కుమార్ రూ.50 లక్షలు వారు తెలిపిన బ్యాంక్ ఖాతాకు పంపించాడు. అనంతరం ఆ సెల్‌ఫోన్ నెంబరు స్విచ్ఛాఫ్ కావడాన్ని గుర్తించి మోసపోయానని తెలుసుకున్న సురేష్ కుమార్, తాంబరం కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై విచారణ చేపట్టిన సైబర్ క్రైం పోలీసులు, ఈ మోసానికి పాల్పడిన కేరళ రాష్ట్రం మలప్పురం సెంబురచ్చేరి ప్రాంతానికి చెందిన ఎస్.మహమ్మద్ సాదిక్‌గా గుర్తించి, అక్కడకు వెళ్లి అతడిని అరెస్ట్ చేసి, లగ్జరీ కారు, రెండు సెల్‌ఫోన్లు, 47 ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఈ వ్యవహారంతో సంబంధాలున్న మరికొందరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ముఖ్యమంత్రి అమెరికా పర్యటన ఎందుకు...?

● కేంద్ర మంత్రి ఎల్.మురగన్

పెరంబూర్, జూన్ 30: అమెరికా పయనం ఎందుకో ముఖ్యమంత్రి స్టాలిన్ వెల్లడించాలని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ డిమాండ్ చేశారు. ట్రిప్లికేన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... స్వదేశీ ఉత్పత్తులు ప్రోత్సహించాలని, మన సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలని 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ సూచించారన్నారు. అమెరికా వెళ్లనున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఎన్ని సంస్థల ప్రతినిధులను కలుసుకోనున్నారని, పెట్టుబడులు ఏ మేరకు సమీకరించాలని నిర్ణయించారు అనే విషయాలు తెలియజేయాలన్నారు. కళ్లకుర్చి కల్తీ సారా వ్యవహారాన్ని సీబీఐ విచారణకు అప్పగించాలన్నారు. పేద ప్రజలకు సంక్షేమ సహాయాలు అందేలా రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కేంద్ర మంత్రి విజ్ఞప్తి చేశారు.

తవ్వకాల్లో బయల్పడిన ప్రాచీన వస్తువులు

ఐసిఎఫ్, జూన్ 30: విరుదునగర్ జిల్లా విజయకరిసల్‌కుళం మూడో విడత పురావస్తు తవ్వకాల్లో బంకమట్టి పతకం, శంఖర గాజులు లభ్యమయ్యాయి. ఇదివరకే 220కి పైగా వస్తువులు తవ్వకాల్లో బయల్పడగా, శనివారం తవ్వకాల్లో ఈ రెండు వస్తువులు లభించాయి. ఈ విషయమై పురావస్తు పరిశోధకులు మాట్లాడుతూ... బంకమట్టితో తయారుచేసిన పతకాలను మహిళలు ఆభరణాలుగా ధరించేవారని, అలాగే వారు ఉపయోగించే శంఖంతో తయారుచేసిన గాజులు కూడా ఉన్నాయని తెలిపారు.

నేటినుంచి తిరుపతి-కాట్పాడి మెము రైళ్ల రద్దు

పెరంబూర్, జూన్ 30: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్‌లోని పలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా జూలై ఒకటి నుంచి 31 వరకు పలు మెము రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● తిరుపతి నుంచి ఉదయం 6.50 గంటలకు బయలుదేరే తిరుపతి - కాట్పాడి మెము స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (నెం 07659), రాత్రి 9.15 గంటలకు కాట్పాడి నుంచి బయలుదేరే కాట్పాడి - తిరుపతి మెము స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (నెం.07582) నెలరోజులు రద్దవుతాయి.

ఇదే విధంగా కాట్పాడి నుంచి ఉదయం 9.30 గంటలకు బయలుదేరే కాట్పాడి - జోలార్‌పేట మెము స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (నెం.06417), మధ్యాహ్నం 12.45 గంటలకు జోలార్‌పేట నుంచి బయలుదేరే జోలార్‌పేట - కాట్పాడి మెము ఎక్స్‌ప్రెస్ (06418) రైలు నెల రోజులు రద్దు చేశారు.

పాక్షిక రద్దు...

తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు బయలుదేరే తిరుపతి - విల్లుపురం ఎక్స్‌ప్రెస్ రైలు (నెం.16853) తిరుపతి - కాట్పాడి మధ్య జూలై ఒకటి నుంచి నెలరోజులపాటు పాక్షికంగా రద్దు చేస్తున్నారు. అలాగే విల్లుపురం నుంచి ఉదయం 5.35 గంటలకు బయలుదేరే విల్లుపురం - తిరుపతి ఎక్స్‌ప్రెస్ (నెం.16854) కాట్పాడి - తిరుపతి మధ్య నెలరోజులు పాక్షికంగా రద్దు చేస్తున్నారు.

నేటినుంచి కోర్టుల బహిష్కరణ

● న్యాయవాదుల సంఘం తీర్మానం

అడయార్, జూన్ 30: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను వ్యతిరేకిస్తూ న్యాయవాదులు కోర్టు నుంచి బహిష్కరించనున్నారు. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన న్యాయవాదుల సంఘం జాక్ తీర్మానం చేసింది. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన న్యాయవాదుల సంఘం సంయుక్త కార్యాచరణ కమిటి జాక్ సమావేశం శనివారం విరుదునగర్ జిల్లాలోని శ్రీవిల్లిపుత్తూరులో జరిగింది. ఇందులో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశం తర్వాత జాక్ అధ్యక్షుడు నందకుమార్ మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం దేశంలో ఐపీసీ, సీఆర్‌పీసా, ఐఈఏ అనే మూడు నేర చట్టాలు అమలవుతున్నాయని, వీటి స్థానంలో కేంద్రం కొత్తగా న్యాయ సంహిత చట్టాలను తీసుకుని వచ్చారన్నారు. ఈ మూడు చట్టాలు జూలై ఒకటి నుంచి అమలు చేయనున్నారని గుర్తుచేశారు. పార్లమెంట్‌లో విపక్ష సభ్యులు లేని సమయంలో ఈ మూడు కొత్త నేర చట్టాలను ఆమోదించుకున్నారని ఆరోపించారు. ఈ చట్టాల అమలును తీవ్రంగా వ్యతిరేకిస్తూ నేటి నుంచి ఈ నెల 8వ తేదీ వరకు రిలే ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

చిత్రజ్యోతి



కవిన్ సరసన రుహానీ శర్మ

వెట్రిమారన్ నిర్మాణంలో కవిన్ హీరోగా 'మాస్క్' పేరుతో ఒక చిత్రం రూపొందుకుంటోంది. ఇందులో ఆండ్రియా నెగెటివ్ రోల్‌లో ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. హీరోయిన్‌గా రుహానీ శర్మను ఎంపిక చేశారు. 2017లో వచ్చిన 'కడైసి బెంచ్ కార్తీక్' అనే చిత్రంలో ఆమె నటించారు. బాలీవుడ్ హీరోయిన్ అయిన రుహానీ శర్మ... భారత క్రికెటర్ విరాట్ కోహ్లి సతీమణి అనుష్క శర్మ సమీప బంధువు. ప్రస్తుతం తెలుగు, హిందీ చిత్రాల్లో బిజీగా ఉన్నారు. ఆమెను ఇపుడు 'మాస్క్' చిత్రంలో హీరో కవిన్ సరసన నటించేందుకు ఎంపిక చేశారు. దీనికి సంబంధించిన చిత్ర బృందం అధికారికంగా వెల్లడించనుంది. ఈ చిత్రం ద్వారా విక్రనన్ అశోక్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు.

సక్సెస్ జాబితాలో 'మళై పిడిక్కాద మణిదన్'

● దర్శకుడు విజయ్ మిల్టన్



మీడియా సమావేశంలో పాల్గొన్న చిత్ర బృందం

ఇటీవల విడులై ఘన విజయం సాధించిన 'గరుడన్', 'మహారాజ' వంటి చిత్రాల జాబితాలో 'మళై పిడిక్కాద మణిదన్' సినిమా కూడా చేరుతుందని చిత్ర దర్శకుడు విజయ్ మిల్టన్ గట్టి నమ్మకం వ్యక్తం చేశారు. ఇన్ఫినిటీ వెంచర్స్ పతాకంపై విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్ బోరా, బి.ప్రదీప్, పంకజ్ బోరా, డి.లలిత సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'మళై పిడిక్కాద మణిదన్'. విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన ఈ చిత్రంలో శరత్ కుమార్, సత్యరాజ్, మేఘా ఆకాష్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. వచ్చే నెలలో ప్రేక్షకుల ముందుకురానున్న నేపథ్యంలో ఈ చిత్రం ట్రైలర్‌ను శనివారం నగరంలో విడుదల చేశారు. చిత్ర దర్శకుడు విజయ్ మిల్టన్ మాట్లాడుతూ, 'రోమియో' చిత్రం ప్రారంభించే సమయంలోనే ఈ సినిమా కూడా మొదలుపెట్టాం. కథపై నమ్మకంతో నాతో కలిసి ప్రయాణం చేసిన చిత్ర బృందానికి ధన్యవాదాలు. సినిమా కోసం పని చేసిన సాంకేతిక నిపుణులందరికీ ధన్యవాదాలు' తెలిపారు. హీరో విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ, 'నా స్నేహితుడు విజయ్ మిల్టన్‌తో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది. దేశంలోనే ది బెస్ట్ సినిమాటోగ్రాఫర్ ఒకరు. 'పిచ్చైకారన్' చిత్రంలో ఇది నిరూపించారు. నేను ఇప్పటివరకు నటించిన చిత్రాల్లోకెల్లా భారీ చిత్రం. బాగా వచ్చింది. శరత్ కుమార్, సత్యరాజ్, శరణ్య మురళిశర్మ, డాలి ధనుంజయన్ వంటి వారితో కలిసి నటిస్తానని ఊహించలేదు. జూలైలో విడుదల చేస్తున్నాం' అని తెలిపారు. నిర్మాత ధనుంజయన్ మాట్లాడుతూ, 'ఒక వ్యక్తి గడిచిపోయిన కాలం.. మరో వ్యక్తి భవిష్యత్ అని చెబుతుంటారు. అలాంటిదే ఈ చిత్ర కథ. ట్రైలర్ తరహాలోనే సినిమా ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది' అని పేర్కొన్నారు.

ఓ స్వీట్ స్టోరీ చూడబోతున్నాం

● నయనతార
● హీరోగా మరో వారసుడు



ఆకాష్, అదితిలతో నయనతార

వెండితెరపై చాలా రోజుల తర్వాత ఓ స్వీట్ లవ్ స్టోరీని చూడబోతున్నామని సీనియర్ నటి నయనతార అంటున్నారు. విష్ణువర్ధన్ దర్శకత్వంలో సీనియర్ నటుడు ఆకాష్ మురళి, అదితి శంకర్ జంటగా నటించిన చిత్రం 'నేసిప్పాయ'. జేవియర్ బ్రిట్టో సమర్పణలో ఎక్స్‌బీ ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత స్నేహ బ్రిట్టో నిర్మించారు. ఈ చిత్రం ద్వారా ఆకాష్ మురళి తమిళ వెండితెరకు హీరోగా పరిచయమవుతున్నారు. ఈ పరిచయ కార్యక్రమంలో ఈ సినిమా పోస్టర్ రిలీజ్ వేడుక తాజాగా నగరంలో జరిగింది. ఇందులో హీరోయిన్ నయనతార, హీరో ఆర్యతో పాటు త్యాగరాజన్, డాక్టర్ ఐసరి కె.గణేష్ వంటి అనేక మంది ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో నయనతార మాట్లాడుతూ, 'ఈ సినిమా ద్వారా కోలీవుడ్‌కు పరిచయమవుతున్న ఆకాష్ మురళికి నా బెస్ట్ విషెస్. హీరోయిన్ అదితి శంకర్ అంటే ఎంతో ఇష్టం. మంచి ప్రతిభ కలిగిన నటి. నేను ఎలాంటి సినిమా కార్యక్రమాల్లో పాల్గొనను. కానీ, ఇది నాకు ఎంతో స్పెషల్. దర్శకుడు విష్ణువర్ధన్, అనుల చిత్రం ఇది. వారిద్దరు 15 యేళ్ళుగా తెలుసు. ఒక విధంగా చెప్పాలంటే ఇది మై ఫ్యామిలీ. అందుకే ఈ వేడుకకు వచ్చాను. ఇంత మంది సినీ ప్రముఖుల సమక్షంలో ఆకాష్ మురళిని పరిచయం చేయడం సంతోషంగా ఉంది. చాలా రోజుల తర్వాత స్వీట్ లవ్ స్టోరీని చూడబోతున్నాం' అని పేర్కొన్నారు. దర్శకుడు విష్ణువర్ధన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా ఒక లవ్ డ్రామా మూవీ. కథలో యాక్షన్ కూడా ఉంది. ఇందులో నూతన నటుడు ఆకాష్ హీరోగా, అదితి ఎంతో ఎనర్జిటిక్‌గా నటించారు. ఖచ్చితంగా ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది' అన్నారు. నిర్మాత జేవియర్ బ్రిట్టో మాట్లాడుతూ, 'ఆకాష్‌ను గ్రాండ్ లెవల్‌లో వెండితెరకు పరిచయం చేయాలన్న కోరిక నెరవేరింది. విష్ణువర్ధన్ వంటి స్టార్ దర్శకుడి ద్వారా ఎంట్రీ ఇస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీత దర్శకత్వంలో పాటు చాలా బాగా వచ్చాయి' అన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అనేక మంది సినీ ప్రముఖులు చిత్ర బృందాన్ని అభినందిస్తూ ప్రసంగించారు.

ఒకపక్క ఆహ్లాదం.. మరోపక్క ఆధ్యాత్మికం

● కొడైకెనాల్, తిరుచెందూరులో పర్యాటకుల రద్దీ



కొడైకెనాల్‌పై దుప్పటిలా పరచుకుంటున్న మంచు



తిరుచెందూరు ఆలయం వద్ద గుమికూడిన భక్తులు

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో, సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుచెందూరులో ఆదివారం సందర్శకుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఎండలు తగ్గటంతో కొడైకెనాల్‌లో ప్రస్తుతం చల్లటి వాతావరణం నెలకొంది. వేకువజామున దట్టమైన మంచు అలముకోవడం, మధ్యాహ్నం చిరుజల్లులు, సాయంత్రం మళ్ళీ మంచు ఇలా కొడైకెనాల్ ప్రాంతంలో ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో వారాంతపు సెలవుల కారణంగా రెండు రోజులుగా కొడైకెనాల్‌ను సందర్శించేందుకు పర్యాటకులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. సిల్వర్ ఫౌంటైన్, గోకర్స్‌వాక్, గుణా గుహ, తూన్‌పారై, గ్రీన్ కేవ్, పైన్‌ఫారెస్ట్, మోయర్‌పాయింట్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచే పర్యాటకులు వేలల్లో వచ్చి సందడి చేశారు. ఇదే విధంగా స్టార్ కెనాల్ వద్ద పర్యాటకులు బోట్‌సవారీ చేసేందుకు బారులు దీరారు. చెరువు ఒడ్డున సైకిళ్లలో, గుర్రాలపై పర్యాటకులు సవారీ చేశారు. పర్యాటకుల సంఖ్య పెరగటంతో కొడైకెనాల్‌లో వ్యాపారాలు కూడా బాగా పుంజుకున్నాయి.

తిరుచెందూరులో...

తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరుదివ్య క్షేత్రాలలో ద్వితీయ క్షేత్రమైన తిరుచెందూరులో రెండు రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ ఏర్పడింది. దీంతో నగరమంతటా ఎటుచూసిన సందడి సందడిగా కనిపించింది. శనివారం సాయంత్రమే వేలాదిమంది భక్తులు తిరుచెందూరులో రాత్రి బసచేశారు. ఆదివారం వేకువజాము సముద్ర స్నానమాచరించి, నాళికినరులోని పవిత్ర జలాలను శిరస్సుపై చల్లుకుని సెందిల్ ఆండవర్ స్వామివారిని దర్శించేందుకు ఆలయం వద్ద క్యూలైన్లో నిలిచారు. వేకువజాము నాలుగు గంటలకే ఆలయాన్ని తెరిచి, 4.30 గంటలకు విశ్వరూపదర్శనం, ఆరుగంటలకు ఉదయమార్తాండ అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోలీసు అధికారులు, సిబ్బందికి ఘనవీడ్కోలు

పెరంబూర్, జూన్ 30: నగర పోలీసు శాఖలో పనిచేస్తూ పదవీవిరమణ పొందిన అధికారులు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ శుభాకాంక్షలు తెలిపారు. ట్రాఫిక్ డీసీపీ ఎస్.రామస్వామి, ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్లు జి.కన్నన్ (తరమణి రేంజ్), కె.శరవణన్ (ఆర్మ్‌డ్ రిజర్వ్), ఆరుగురు ఎస్‌ఐలు, 30 మంది ఎస్‌ఐలు, డీటీపీ ఆపరేటర్, ముగ్గురు పోలీస్‌స్టేషన్ల క్లీనర్లు, ఒక ఆయా మొత్తం 68 మంది ఆదివారంతో పదవీవిరమణ పొందారు. ఎగ్మూర్‌లోని రాజారత్నం స్టేడియంలో శనివారం సాయంత్రం పదవీవిరమణ పొందిన వారి వీడ్కోలు సభ జరిగింది. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ పాల్గొని, పదవీవిరమణ చేస్తున్న వారికి శాలువాలు, జ్ఞాపికలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు శాఖలో 25 నుంచి 42 ఏళ్ల పనిచేసిన వారి సేవలు కొనియాడుతూ, భవిష్యత్తులో ఎలాంటి అవసరమొచ్చినా తనను కలుసుకోవచ్చని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ (ప్రధాన కార్యాలయం) కపిల్‌కుమార్, డీసీపీ సి.శరత్కర్, పోలీసు అధికారులు, పదవీవిరమణ పొందిన వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



పోలీసుల కుటుంబసభ్యులతో నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్



మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీజేస్తున్న జీఎమ్మార్ డైరెక్టర్ మణిసంతోష్ బొమ్మిడాల

సమాజసేవలో ముందుండాలి

● జీఎమ్మార్ డైరెక్టర్ మణిసంతోష్

ప్యారీస్, జూన్ 30: సమాజసేవలో ఆర్యవైశ్యులు ముందుండాలని జీఎమ్మార్ గ్రూప్ డైరెక్టర్ బొమ్మిడాల మణిసంతోష్ పేర్కొన్నారు. స్థానిక కొత్వాల్‌చావిడిలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం కన్వెన్షన్ హాలులో ఆదివారం ఉదయం వాసవి మాత ప్రత్యేక పూజలతో తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ గ్రేటర్ చెన్నై ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గ్రేటర్ చెన్నై ఛైర్మెన్ కేకే త్రినాధ్‌కుమార్ సారధ్యం వహించిన ఈ కార్యక్రమాలకు వాసవి సభ, ఆర్యవైశ్య చారిటబుల్ అండ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్లు సహకారం అందించాయి. జీఎమ్మార్ గిఫ్ట్ హ్యాంపర్స్‌గా 1,500 మందికి నూతన వస్త్రాలను మణిసంతోష్, తారణ పంపిణీ చేశారు. గత పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు రూ.5 లక్షల ఉపకారవేతనాన్ని ఏటీసీఈఎఫ్ అధ్యక్షుడు కె.రవికుమార్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వామ్ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ, గ్లోబల్ అడ్వయిజర్ టి.రాజశేఖర్, చీమకుర్తి గోవిందరాజులు, డి.రవిచంద్రన్, రాధాకృష్ణన్ బాలాజి, బీఎస్ శ్రీధర్, ఎంఏ నరసింహాలు, ఇ.శాంతారం తదితరులు పాల్గొన్నారు.

కేఎంజీ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ట్రస్టు నిర్వాహకులు

ప్యారీస్, జూన్ 30: కొల్లిపార మాజేటి జయశ్రీ (కేఎంజీ) చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తెలుగు విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. పురుషవాక్కం మారుతి అపార్ట్‌మెంట్‌లో ఆదివారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నగరంలోని పాఠశాలలు, కళాశాలలో చదువుతున్న తెలుగు మాధ్యమ విద్యార్థులు, తెలుగు ద్వితీయ పాఠ్యాంశంగా తీసుకున్న విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ ట్రస్టీలు డాక్టర్ ఎం.ఎస్. చంద్రగుప్త, ఎం. తనూజా తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలకు వ్యతిరేకంగా

మహిళా ఆర్ఐ విల్లుపాట ప్రచారం



విల్లుపాట పాడుతున్న రెవెన్యూ అధికారి గోమతి

చెన్నై, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ఓ మహిళా అధికారి విల్లుపాట పాడుతూ అవగాహన ప్రచారం నిర్వహించడం సాంఘిక సంక్షేమ అధికారులకు విస్మయం కలిగించింది. ఆ జిల్లాలోని పాప్పాక్కుడి ప్రాంతంలో ఇటీవల కాలంలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు సమాచారం అందటంతో సామాజిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాధారణంగా ఇలాంటి కార్యక్రమాలకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఎంపిక చేసేవారు. ఆ విద్యార్థులు, వీధి నాటకాలు వేసి లేదా, పాటలు పాడి ప్రచారం చేయడం ఆనవాయితీ. అయితే గత రెండు రోజులుగా ఆ ప్రాంతంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మహిళా రెవెన్యూ అధికారి పాటలు పాడి ప్రచారం చేయడంతో స్థానికులతో పాటు, సహోద్యోగులు కూడా ఆశ్చర్యపోయారు. తిరునల్వేలి జిల్లా ముక్కూడల్ ఆర్ఐగా పనిచేస్తున్న గోమతి కృష్ణమూర్తి పాప్పాకుడి పాఠశాలల్లో విల్లుపాటతో విద్యార్థినులకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను గురించి ప్రచారం చేశారు. ఆ మహిళా అధికారి ఇలా గ్రామీణ కళాకారిణిలా విల్లుపాటను పాడటం అందరిని విస్మయపరచింది.

ముమ్మరంగా చెన్నై మెట్రో రైల్ పనులు



ప్యారీస్, జూన్ 30: రాజధాని నగరంలో రెండో విడత చెన్నై మెట్రోరైలు పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. ఉత్తర చెన్నై పరిధిలోని మాధవరం పాల ప్లాంట్ నుంచి దక్షిణ చెన్నై సిరుచ్చేరి సిప్కాట్ వరకు మూడవ మెట్రోరైలు మార్గం గ్రీన్‌వేస్ రోడ్డు నుంచి ప్రారంభమై అడయార్ జంక్షన్ వరకు సొరంగమార్గం తవ్వకాల పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం మొదటి సొరంగమార్గం పనుల నిమిత్తం 'కావేరి' అనే భారీ యంత్రాన్ని వినియోగించనున్నారు. 116.1 కి.మీ మేర మూడు మెట్రోరైలు మార్గాలు ఏర్పాటుకానున్న నేపథ్యంలో, వీటిలో మాధవరం-సిరుచ్చేరి సిప్కాట్ వరకు 45.4 కి.మీ. గ్రీన్‌వేస్ రోడ్డు నుంచి అడయార్ జంక్షన్ వరకు 1.226 కి.మీ మేరకు సొరంగ మార్గం నిర్మాణపనులు గత ఏడాది ఫిబ్రవరి 16న ప్రారంభమయ్యాయి. మొదటి సొరంగమార్గానికి వినియోగించిన కావేరి యంత్రాన్నే ఈ పనులకు కూడా ఉపయోగించనున్నారు. ఈ నెలాఖరులోగా అడయార్ జంక్షన్ వరకు చేపట్టిన సొరంగమార్గం పనులు పూర్తవుతాయని సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. భూమిలోపల బండరాళ్లు అధికంగా పాతుకుపోయి ఉన్నాయని, ఇందువల్ల సొరంగమార్గం తవ్వకాల్లో జాప్యం ఏర్పడకుండా కావేరి యంత్రాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

స్టాలిన్ పాలన భేష్!



రంజన్‌కుమార్

ప్యారీస్, జూన్ 30: రాష్ట్రంలో గత మూడేళ్లుగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకే ప్రభుత్వ హయాంలో అన్ని రంగాలు అభివృద్ధిచెందుతున్నాయని, ప్రత్యేకించి ఎస్సీఎస్టీల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేత రంజన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేస్తూ గిరిజన సంక్షేమం కోసం అంబేడ్కర్ పరిశ్రమల అభివృద్ధి పథకం, ఎస్సీఎస్టీల స్టార్టప్ పథకం, ఇటీవల జరిగిన శాసనసభ సమావేశంలో గిరిజనాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు కూడా ప్రకటించారని, ఇలా బలహీనవర్గాల వారికి కూడా పథకాల ఫలితాలు అందేలా డీఎంకే ప్రభుత్వం సుపరిపాలనను అందిస్తోందని కితాబిచ్చారు.

బర్త్‌డే వేడుకలకు

కోవై బోట్ హౌస్‌లో వింత పడవ



షార్క్ చేప నమూనాలో పడవ

పెరంబూర్, జూన్ 30: జన్మదిన వేడుకలు తదితర శుభకార్యాలను పడవలో జరుపుకొనేలా కోయంబత్తూర్ బోట్ హౌస్‌లో కొత్తరకం పడవ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కోయంబత్తూర్ కార్పొరేషన్‌లో 'స్మార్ట్ సిటీ' పథకం కింద ఉక్కడం పెరియ కుళం, సెల్వచింతామణి కుళం, వాలాంకుళం, కుమారస్వామి, చింతామణి కుళం తదితర ప్రాంతాలు ఆధునికీకరించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అందులో ఉక్కం పెరియకుళం గట్టు వెంబడి వాకింగ్, సైకిల్ ట్రాక్, విశ్రాంతి తీసుకొనేలా సీట్లు ఏర్పాటు చేశారు. అలాగే, ఓపెన్ ఆడిటోరియం, హోటళ్లు, పడవ రెస్టారెంట్ అందుబాటులో ఉన్నాయి. అలాగే, చెరువులో పడవ సవారీ అందుబాటులో ఉంది. ఈ నేపథ్యంలో, జన్మదినం, శుభకార్యాలయాలు పడవలో చేసుకునే సౌకర్యం కల్పించారు. ఇందుకోసం షార్క్ నమూనాలో ఉన్న పడవలో 35 మంది కూర్చొనే సదుపాయం ఉంది. ఒక వ్యక్తికి రూ.150 ఛార్జీ నిర్ణయించారు. ఈ పడవలో ఉక్కడం పెరియకుళం, వాలాకుళం పూర్తిగా ఒక గంట చుట్టిరావచ్చు. పర్యాటకుల రక్షణ దృష్ట్యా భద్రతా ఉపకరణాలు కూడా ఏర్పాటుచేశారు. ఈ నూతన షార్క్ బోట్ చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇక్కడకు వచ్చే వారు ఈ పడవ వద్ద ఆసక్తిగా సెల్ఫీలు తీసుకుంటున్నారు.

ఆరేళ్ల తర్వాత నగరంలో లో ఫ్లోర్ బస్సులు



రాజస్తాన్ నుంచి దిగుమతైన లో ఫ్లోర్ బస్సులు

పెరంబూర్, జూన్ 30: రాజస్తాన్ నుంచి రెండు కొత్త లో ఫ్లోర్ బస్సులు క్రోంపేట డిపోకు చేరుకున్నాయి. ఈ విషయమై రాష్ట్ర రవాణా ఎక్స్‌ప్రెస్ సంస్థ అధికారులు మాట్లాడుతూ... నగరంలో 2018లో ఏసీ లో ఫ్లోర్ బస్సు సర్వీసులు ప్రారంభించామన్నారు. అనంతరం ఈ బస్సులు నిలిపివేసిన నేపథ్యంలో, ప్రస్తుతం మళ్లీ ఆ బస్సులు ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. తొలివిడతగా రెండు కొత్త బస్సులు రాజస్తాన్ నుంచి వచ్చాయని తెలిపారు. ఈ బస్సుల్లో దివ్యాంగులు సులభంగా ఎక్కి, దిగవచ్చన్నారు. వేగపరిమితి లేని ప్రధాన రోడ్లలో మాత్రమే ఈ బస్సులు నడుపనున్నామని అధికారులు తెలిపారు.

నేటినుంచి మెరైన్ ఎక్స్‌పో



మెరైన్ ఎక్స్‌పో వివరాలను మీడియాకు వివరిస్తున్న నిర్వాహకులు ప్రభాకర్, మనో

ప్యారీస్, జూన్ 30: స్థానిక కొట్టివాక్కం ఓఎంఆర్ రోడ్డు వైఎంసీఏ గ్రౌండ్‌లో మెరైన్ ఎక్స్‌పో-2024 పేరుతో అతి పెద్ద జలచరాల ప్రదర్శన సోమవారం నుంచి 45 రోజుల పాటు జరుగనుంది. ఈ మేరకు ప్రదర్శన నిర్వాహకులు ప్రభాకరన్ ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సముద్ర జీవరాశుల ప్రదర్శనలోని కీలక అంశాలు వివరించారు. రాజధాని నగరంలో ఓపెన్ గ్రౌండ్‌లో మొట్టమొదటిసారిగా మెర్మేడ్ కార్యక్రమాన్ని పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. చిన్నారులు విహరించేందుకు చిన్న సైజు బ్యాటరీ కార్లతో పాటు ఇళ్లకు అవసరమైన ఫర్నిచర్, ఇతర పరికరాలు, దేశంలోని పలు రాష్ట్రాల బెడ్‌షీట్లు, డ్రస్‌లు, ప్లాస్టిక్ వస్తువులు, అలంకరణ సామగ్రి తదితరాలతో స్టాల్స్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన సోమవారం నుంచి ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలు సందర్శించవచ్చని, ఈ ప్రదర్శన ప్రవేశరుసుము ఐదేళ్లకు పైబడిన వారికి రూ.150గా నిర్ణయించినట్లు ప్రభాకరన్ తెలిపారు.

క్రమశిక్షణతో జీవితంలో ఎదుగుదల

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్



చెన్నపురి అన్నదాన సమాజంలో అన్నదానం ప్రారంభిస్తున్న రవిచంద్రన్

ప్యారీస్, జూన్ 30: జీవితంలో ఎదుగుదలకు మార్కులు మాత్రమే సరిపోవని, క్రమశిక్షణ కూడా ముఖ్యమని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్.రవిచంద్రన్ పేర్కొన్నారు. వాసవి క్లబ్ షావుకారుపేట చెన్నై, వనతి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని చెన్నపురి అన్నదాన సమాజంలో ఆశ్రయం పొందుతున్న 90 మందికి పైగా అనాథ పిల్లలకు ఆదివారం విద్యాసామగ్రి, సిబ్బందికి నూతన వస్త్రాలు, చీరలు, ఉపకారవేతనం పంపిణీ కార్యక్రమం క్లబ్ అధ్యక్షులు చీమకుర్తి మల్లికార్జునరావు-నాగలక్ష్మి దంపతుల అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా రవిచంద్రన్ పాల్గొని వితరణ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వి-502ఏ గవర్నర్ రష్మి ఓలేటి, ఎం.లావణ్య, ముంజులూరు మురళీమోహన్, బోగనాధం శివకుమార్, ఎస్వీ పద్మనాభన్, త్రిలోక్‌బాబు-పూర్ణిమ, ప్రవీణ్‌కుమార్-శివరంజిని, ఉపేంద్రకుమార్, జి.శ్రీధర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు. రవిచంద్రన్ గుడ్‌విల్ విజిట్ సందర్భంగా అన్నదాన పథకాన్ని ప్రారంభించారు.

101 పింక్ ఆటోల పంపిణీ

అడయార్, జూన్ 30: మహిళా సాధికారత కోసం రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై అనేక రకాల కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా, తాజాగా అర్హులైన మహిళలకు 101 పింక్ ఆటోలను ప్రదానం చేసింది. రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రోటేరియన్ మహవీర్ బోత్రా వీటిని అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 200 మందికిపైగా సింగిల్ పెరెంట్ తల్లులను ఎంపిక చేయగా, వంద మందికి వివిధ రకాల పరీక్షలు చేసిన తర్వాత ఈ ఆటోలను పంపిణీ చేశారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఈ ప్రాజెక్టు రూపొందించి దాని అమలును మాజీ గవర్నర్ చంద్ర మోహన్ ప్రారంభించారు. గడిచిన మూడేళ్ళలో 101 పింక్ ఆటోలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహవీర్ బోత్రా మాట్లాడుతూ, మహిళలకు పింక్ ఆటోలు పంపిణీ చేయడమేకాకుండా, నిర్వహణ ఖర్చుల కోసం నెలకు రూ.5వేలు ఆర్థిక సాయం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్టు పేర్కొన్నారు. ప్రతి నెలా ఆటో, ఆర్‌సీ బుక్ చూపించి నిర్వహణ ఖర్చులు పొందవచ్చని తెలిపారు. భర్తను కోల్పోయిన లేదా కూలికి వెళ్లాల్సిన మహిళలను గుర్తించి, వారికి ఆటో డ్రైవింగ్‌లో తగిన శిక్షణ ఇచ్చిన తర్వాతే ఆటోలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రొటేరియన్లు పాల్గొన్నారు.



మహిళకు పింక్ ఆటో అందజేసిన మహవీర్ బోత్రా తదితరులు